# ఇదో మలుపు

సారథి వారం రోజుల్నుంచి పిచ్చిపట్టినట్లు ప్రతి వీధీ తిరుగుతున్నాడు. ఆజాను బాహువుగా కనిపించే ప్రతి వ్యక్తినీ పరిశీలనగా చూడటం, అతడు కాదన్నట్లు నిరాశగా ముందుకు సాగడం.

ఇక తన ప్రయత్నం విరమించుకుంటే బాగుంటుం దేమో సరిగా తినీ తినక తిరగడం వల్ల కాళ్ళు నొప్పులు పుడ్తున్నై. దాహం వేస్తోంది కాసిని మంచినీళ్ళు అడిగితే బాగుండు, ఆలోచించి ఆలోచించి మనసు, తిరిగి తిరిగీ శరీరం రెండూ బాగా అలసిపోయినై.

ఆకలి వేస్తోంది. ఎవరన్నా మంచినీళ్ళు ఇస్తారేమోగాని అన్నం ఎవరు పెడ్తారు? ఇంటికి వెళ్దామంటే ఇంట్లో ఒకపూట అన్నం వుంటే మరోపూట పస్తే. ఎట్లాగొట్లా మెట్రిక్ పాసై ఏదో ఒక ఉద్యోగం దొరుకుతుందేమోనని శత విధాల ప్రయత్నిస్తున్నాడు సారథి. అవసరానికి కూలీపని, రిక్షా లాగటం చేశాడు. ఎక్కడా నిలదొక్కుకో లేదు, దేనితోనూ కడుపు నిండలేదు, నాన్న చెప్పే ట్యూషన్లమీద కడుపులు ఎట్లా నిండుతై? అమ్మకూడా ఎవరింట్లోనో వంట చేస్తుంది.

పేదరికం మీద, అసలీ జీవితంమీదా చాలా విరక్తిగా ఉంది సారథికి. బాగా చదువుకోవాలన్న తన కోరిక తీరలేదు. చెల్లెళ్ళ

నైనా చదివించాలి. తమ్ముళ్ళను పైకి తేవాలి, అన్నీ ఆశలే? అడి యాసలు....నవ్వుకున్నాడు విరక్తిగా సారథి.

దాహం....చాలా దాహంగా ఉంది. తలపైకెత్తి చూస్తే ఒక వీధి వాకిలి తెరచి వుంది. గుమ్మందాకా వెళ్ళాడు? ఏమని పిలవాలో తోచక, చివరికి నోరు పెకిలించుకుని "ఏమండి" అని పిలచాడు.

పరికిణీ, ఓణీ వేసుకున్న ఓ అమ్మాయి గుమ్మం దగ్గరికి వచ్చి "ఎవరికోసం వచ్చారు?" అంది.

"దాహంగా వుంది-కాసిని మంచినీళ్ళు కావాలి" అన్నాడు సిగ్గు పడుతూ సారథి.

ఒక క్షణం పాటు అతన్ని పరిశీలగా చూసిన అమ్మాయి లోప లికి వెళ్ళి మంచినీళ్ళు తీసుకొచ్చి ఇచ్చింది.. ఎన్ని నీళ్ళు తాగాడో నీళ్ళతో కడుపు నిండిపోయింది.

"థ్యాంక్సండీ వస్తాను" కృతజ్ఞతలు చెప్పి వెను తిరగబోయే సమయానికి "ఎవరు వచ్చారమ్మా" అంటూ వచ్చాడొకాయన లోపల్నుంచి.

వెను దిరిగిన సారథి మళ్ళీ అటుతిరిగాడు. విభ్రమంగా ఆయన్నే చూస్తుండి పోయినాడు.

"ఎవరో తెలియదు నాన్నా ! మంచినీళ్ళడిగితే ఇచ్చాను" వాణి చెప్తున్న మాటలుకూడా సారథికి వినిపించడంలేదు.

సారథి ఆయన దగ్గరగా వెళ్ళాడు. హఠాత్తుగా ఆయన రెండు చేతులూ పట్టుకుని 'నన్ను క్షమించండి సార్' అన్నాడు అశ్రునయనాలతో రంగారావు గారు తెల్లబోయినారు.

"నువ్వెవరు బాబు! ఏమిటిది?" అంటూ అయోమయంగా ప్రశ్నించాడు. వాణి కూడా అట్లాగే చూస్తుండిపోయింది ఇదేంనాటకమన్నట్లుగా.

"వారం రోజుల క్రిందట మీ జోబులోంచి పర్సు పోయిందా సార్?" అన్నాడు సారథి

"ఆఁ నీకేం తెలుసు? అన్నారు రంగారావుగారు ఆశ్చర్యంగా.

"చెప్తాను....ఆరోజు....అని సారథి మొదలు పెడ్తుంటే రంగారావుగారు "ముందు కూర్చో" అని తాను కూర్చున్నాడు.

సారథికి అది చెప్తుంటే ఆరోజు ఘట్టం కనులముందు మెదుల్తోంది.

X X X

అంతకు ముందు రోజు అన్నం తినలేదేమో లేస్తూనే ఆకలి-అమ్మ వంట చేసే సూచనలేమైనా ఉన్నాయేమోనని వంటింటి వైపు చూశాడు. అమ్మ వంటింట్లో ఓ మూల పడుకుని ఉంది. తమ్ముళ్ళు, చెల్లెళ్ళు ఎవరూ కనబడలేదు. ఏరోడ్డు మీద దుమ్ముకొట్టుకుంటున్నారో-నాన్న కనిపించలేదు.

ఇంటి పరిస్థితికి మనసు ఏడుస్తోంది. అన్నం పెట్టలేని వాళ్ళు అసలెందుకు కనాలి-అని ఒక క్షణం అమ్మమీద, నాన్నమీద కోపం

వచ్చింది. కొంచెంసేపు సమాజంమీదా, మరి కొంతసేపు ఈవ్యవస్థ మీదా మండి పడ్తున్నాడు సారథి. మనసులో డిప్రెషన్. కొందరు ఏమీ కష్టపడకుండా సుఖాలనుభవిస్తుంటే మరి కొందరికి బతుకుదామన్నా అవకాశం లేని పరిస్థితులు.... ఏదో కసిగా వుంది. నిస్సహాయత అసలు నిలువనీయడ్లేదు. కర్మ అని అసలు సరిపెట్టుకోవాలని లేదు ఆకలితో మాడటం నా ఖర్మ అని ముడుచుకు పడుకుంటే రోజులు గడిచేదెట్లా?

రోడ్డుమీద నడుస్తున్నాడు సారథి.... ఏదైనా అదృష్టం కలిసి వచ్చి తాను లక్షాధికారి కాకూడదూ? కనీసం లాటరీ టికెట్టయినా కొన లేదే తను. బజార్లన్నీ ఇంత సందడిగా ఎట్లా వున్నాయ్? అందరూ ఏదో ఒకటి కొంటున్నారు. అన్ని డబ్బులెక్కడివో....? అన్నీ ప్రశ్నలే నడుస్తూ నడుస్తూ బట్టల దుకాణం దగ్గరకు వచ్చాడు. బొమ్మకు కట్టిన చీర వంక చూశాడు. కొంత సేపు తర్వాత దృష్టిలోపలికి మరల్చాడు. ఎవరో ఓ పెద్దమనిషి బట్టల ప్యాకెట్ తీసుకుని కౌంటర్లో బిల్లు చెల్లిస్తున్నాడు. పర్సు తీస్తుంటే సారథి కళ్ళు ఆశ్చర్యంతో వెడల్పయినై. నోట్ల దొంతర అసలొక మనిషి దగ్గర అంత డబ్బు ఎట్లా ఉంటుందో- ఆయన పర్సు లాల్చీ జేబులో పెట్టుకున్నాడు. కానీ పూర్తిగా అది జేబులోకి దూరలేదు. బయటికి తొంగిచూస్తోంది ఆయన నడిచి వెళ్ళి పోతున్నాడు. తెలియకుండానే ఆయన వెనుక నడవడం మొదలు పెట్టాడు సారథి. తెలియకుండానే అది కొట్టేయాలని ఆలోచన రావడ మేమిటి అది చిగుర్లు తొడిగి వేళ్ళూనింది. ఆయనొక నిర్మానుష్యమైన సందులోకి తిరగ్గానే పక్కగా వెళ్ళి జేబులోంచి పర్సు తీశాడు. ఆ పెద్దమనిషి అసలు తల తిప్పికూడా చూడలేదు. మొట్టమొదటి సారి చేయడమేమో కాళ్ళు, చేతులు వణికిపోతున్నై. భయం, తప్పుచేశానన్న

భావం ఉక్కిరి బిక్కిరి చేస్తున్నై. అడుగులు తడబడ్తుంటే పక్కనున్న చిన్న సందులోకి జారుకుని ఊపిరి తీసుకున్నాడు సారథి. నాలుగు రోజులు ఇంట్లో అందరూ హాయిగా భోజనం చెయ్యొచ్చు. పాపం అమ్మకి సరయిన చీరలేదు.... నాన్నకు....

హఠాత్తుగా చేతిమీద చెయ్యి పడేసరికి ఉలిక్కిపడ్డాడు సారథి.

సూటు వేసుకున్న ఓ పెద్దమనిషి "రాస్కెల్ నా పర్సు దొంగతనం చేస్తావా" అంటూ పర్సు లాక్కున్నాడు....అసలు అతడంటున్నదేమిటో అర్థం కావటంలేదు సారథిదికి.

"ఇది నీ పర్సు కాదు-కానేకాదు"అన్నాడు గొంతు పెగుల్చుకొని.

"దొంగతనం చేసింది-కాక సిగ్గులేక మాట్లాడుతున్నావా?" అతడు ఇష్టమొచ్చినట్లు అరుస్తుంటే దారినపోతున్న వాళ్ళంతా జమ అయినారు. అందరూ తలా ఓమాట అంటున్నారు. ఒకళ్ళు పోలీసులకు ఒప్పగించాలన్నారు. ఒకళ్ళు నాలుగు తన్నమన్నారు. కానీ సారథి చెవులకేం వినిపించడం లేదు. అంతా అయోమయంగా ఉంది. "ప్రపంచంలో ఇంత ఘోరమైన అన్యాయం కూడా జరుగుతుందా? తాను కొట్టెయ్యడం చూసి అసలు వ్యక్తి పరిసరాల్నుంచి దూరంగా వెళ్ళిన తర్వాత చేసే ఘరానా దొంగతనమంటారా దీన్ని...."

X X X X

"ఆ రోజు నుంచీ మీ కోసం వెతుకుతున్నానుసార్! జీవితంలో ఇంకెప్పుడూ దొంగతనం చెయ్యను. నన్ను క్షమించండి" సారధి కళ్ళ ల్లోంచి నీరు జారిపడ్తున్నై.

"బాబూ! తప్పునీదికాదు, పరిస్థితులది" ఆ యువకుడి పట్ల రంగా రావు గారి మనసు అర్ద్రమైంది. అతని నిజాయితీని హర్షించకుండా ఉండలేక పోతున్నాడు.

"బాబూ! నీ పేరేమిటన్నావ్?" మళ్ళీ ప్రశ్నించారు,

"సారధి"

"వాణీ! సారథి ఇక్కడే భోజనంచేస్తాడు. అమ్మను ఆ ఏర్పాటు చేయమను" అన్నాడు వాణిని ఉద్దేశించి.

"వద్దండీ–నేను తినను. నాకు సెలవిస్తే వెళ్ళిపోతాను"అన్నాడు సారథి. తాను ఎవరిదగ్గరయితే దొంగతనం చేశాడో మళ్ళీ అయన తనను గౌరవించడమే గాక అన్నం పెట్టడమా?....

"నువ్వు భోజనం చేస్తేనే నాకు తృప్తిగా ఉంటుంది" రంగా రావుగారి వాత్సల్యం సారధికి మరీ ఇబ్బందిగా ఉంది.

"ఒక దొంగను మీరు...." అంటున్న సారధిని వారిస్తూ రంగా రావుగారు" నీ నిజాయితీ నాకు నచ్చింది, నా స్నేహితు డొకతనికి ఫ్యాక్టరీ ఉంది. అక్కడ నీకు ఉద్యోగంఇప్పిస్తాను...."

ఈ మాటలకు సారథిలో ఆనందం తళుక్కుమంది.

"మీ ఋణం తీర్చుకోలేను సార్ !"

"నాకు పొగడ్తలంతగా నచ్చవు. నీకు సాయంచేయాలనిపించింది చేస్తున్నాను" అన్నారు రంగారావుగారు ఇంకా మాట్లాడటానికి అవకాశం ఇవ్వకుండా.

"అదియును ఒకందుకు మంచిదే" అన్నట్లు కొన్నిసార్లు చెడు కూడా మంచికి దారితీస్తుందని తన ఈ అనుభవం ఋజువు చేస్తుంది.... తన జీవితంలో ఈమార్పు చాలాచిత్రం....రంగారావుగారు పిలిచేవరకు ఆలోచనల వలయంలోనే పరిభ్రమిస్తున్న సారధి ఈ లోకంలోకివచ్చి భోజనం చెయ్యటానికి ఆయన వెంట మౌనంగా లోపలికి నడిచాడు. ఇప్పుడు భవిష్యత్తు సారధికి ముళ్ళ మయంగా కనిపించడంలేదు గమ్యాన్ని చేరడానికి సన్నని కాలి బాట కనిపిస్తున్నది.

(క్రొత్తకథ, (అభినందన సంస్థ ప్రచురణ) కథల సంపుటినుంచి, అక్టోబర్ '84)